# రైతు భవిష్యత్తుకు మెగా రైతు మేళా దిశానిర్దేశం

**పంటల మార్పిడితో రైతులకు స్థిర ఆదాయం**
**సహజ వ్యవసాయంపైనే భవిష్యత్ ఆధారం**
**- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**






**హనుమకొండ, బ్యూరో మే 7 (జర్నలిస్ట్ వార్త):** రైతుల ఆదాయ పెరుగుదలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ విధానాలు, యాంత్రీకరణ, మార్కెటింగ్, విత్తనాలు, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించడమే మేళా ప్రధాన ఉద్దేశమని తెలిపారు.రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల మార్పిడి చేపట్టాలని సూచించిన మంత్రి, ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభదాయకమని పేర్కొన్నారు. సిద్దిపేటలో ఆయిల్ పామ్ మిల్లును ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భూసారం కాపాడుకోవడం అత్యంత అవసరమని, రసాయన ఎరువుల అధిక వినియోగం ఆరోగ్య సమస్యలకు దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సహజ, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను రైతులు అవలంబించాలని పిలుపునిచ్చారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండున్నరేళ్లలో 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. రైతుబంధు నిధుల విడుదల, యూరియా సరఫరా, పంట కొనుగోళ్లలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. దేశంలోనే మొక్కజొన్న కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని స్పష్టం చేశారు.


రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ కల్తీ ఆహార పదార్థాల నేపథ్యంలో సహజ వ్యవసాయానికి ప్రాధాన్యం పెరిగిందన్నారు. రైతులు ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేయాలని సూచించారు.

వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం రైతు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని తెలిపారు.ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కె ఆర్ నాగరాజు రైతు సంక్షేమ పథకాల అమలు, 24 గంటల విద్యుత్ సరఫరా, రుణమాఫీ, పంట కొనుగోళ్లపై ప్రభుత్వ కృషిని వివరించారు.

ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం, అంతర పంటల సాగుతో విజయాలు సాధిస్తున్న మహిళా రైతులు లావణ్య రెడ్డి, భాగ్యలక్ష్మి తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ఆదర్శ రైతులను మంత్రులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు.



# పుల్లాయిగూడెం ఆలయ పూజల్లో పాల్గొన్న టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు



**పాల్వంచ/, మే 7 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని పుల్లాయిగూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయ పూజా కార్యక్రమాల్లో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా నాగా సీతారాములు మాట్లాడుతూ, అనేక వ్యయప్రయాసలకు ఓర్చి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసిన కమిటీ సభ్యులను అభినందించారు. రేపు నిర్వహించనున్న దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు నాగా సీతారాములను పట్టు శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు నూకల రంగారావు, 45వ డివిజన్ కార్పొరేటర్ దంతెబోయిన నరేష్, కొత్తగూడెం పట్టణ ఓబీసీ అధ్యక్షులు జయప్రకాష్, ఓబీసీ నాయకులు ఆవుల మధు, యువజన కాంగ్రెస్ నాయకులు భరత్, దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బక్రీద్ నేపథ్యంలో ముందస్తు చెక్‌పోస్టులు

**గోవుల అక్రమ రవాణా, మత్తు పదార్థాల నియంత్రణపై ప్రత్యేక నిఘా**



**ఎల్కతుర్తి,/ మే 7 (జర్నలిస్ట్ వార్త):** బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఎల్కతుర్తి మండలంలోని పెంచికల్పేట్ గ్రామ శివారులో కరీంనగర్ హైవే సమీపంలో ప్రత్యేక చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత తెలిపారు.గోవుల అక్రమ రవాణా, గంజాయి, ఇతర మత్తు పదార్థాల తరలింపును అరికట్టడమే లక్ష్యంగా ఈ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. గతంలో ఇదే ప్రాంతంలో గంజాయి, మత్తు పానీయాలను స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా నిఘా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.రాత్రివేళల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని డీసీపీ తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి అనుమానాస్పద కదలికలపై సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్సై నరసింహారావు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యకు ఘన సన్మానం



**ఖమ్మం/, మే 7 (జర్నలిస్ట్ వార్త):** తెలుగు దేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా నియమితులైన వర్ల రామయ్యను మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఖమ్మం జిల్లా నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, రాయల కోటేశ్వరరావు, నామ ఉపేందర్, చావా రఘు తదితరులు వర్ల రామయ్యను శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన నిర్ణయాలపై చర్చించేందుకు పొలిట్‌బ్యూరోలో ఆయనకు స్థానం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.

అలాగే తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు.

# బీఆర్ఎస్ కార్యాలయంపై దాడిని ఖండించిన ఇల్లందు మాజీ ఎమ్మెల్యే.

**బయ్యారం/,మే 7.(జర్నలిస్ట్ వార్త)**



ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి ముప్పు అని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ అన్నారు. అనునిత్యం ప్రజల సమస్యల పట్ల పోరాడుతున్న భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పట్ల కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన తప్పుడు ఆరోపణలను ఖండించిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై బండి సంజయ్ అనుచరులు వీధి రౌడీల్లాగా విధ్వంసాన్ని సృష్టిస్తూ భయానక వాతావరణ కల్పిస్తూ కరీంనగర్ ఎమ్మెల్యే కార్యాలయంపై దాడి చేయడం అనేది సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్రంలో అధికారంలో ఉన్నవారే హింసను ప్రోత్సహించడం,పోలీసుల సమక్షంలోనే దాడులు జరగడం చూస్తుంటే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఏ విధంగా పనిచేస్తుందనేది తెలుస్తుందని హోం మంత్రి లేకనే రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపుతప్పాయని మండిపడ్డారు.మా నాయకులపై ఎన్ని కుట్రలు చేసినా,ఎన్ని దాడులు చేసినా బిఆర్ఎస్ పార్టీ వెనుకడుగు వేయదని, ప్రభుత్వ వైఫల్యాల పట్ల,ప్రజల సంక్షేమం కోసం మా పోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరించారు.రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారని, ఇటువంటి విధ్వంసకర అరాచక రాజకీయ వ్యవస్థకు బుద్ధి చెప్పే సమయం దగ్గర్లోనే ఉందని హెచ్చరించారు.

# రైతన్నకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**తల్లాడలో రైతు వారోత్సవం - వ్యవసాయ యాంత్రికరణ ప్రారంభోత్సవం**





**తల్లాడ,/ మే 7 (జర్నలిస్ట్ వార్త):** రైతన్న సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం సహకార, వ్యవసాయ, విద్యుత్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవం వ్యవసాయ యాంత్రికరణ ప్రారంభోత్సవ కార్యక్రమం తల్లాడ మండలంలోని గంగాదేవిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) వద్ద ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచించారు. అధిక రసాయనాల వాడకం వల్ల భూమి సారం తగ్గిపోవడంతో పాటు పంట దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయని తెలిపారు. అలాగే వరి కొయ్యలను కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని హెచ్చరించారు.వ్యవసాయ అధికారులు సూచించిన విధానాలను రైతులు పాటించాలని కోరిన ఎమ్మెల్యే, రైతును రాజుగా నిలబెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులకు కల్టివేటర్లు, డ్రోన్లు అందిస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు కల్టివేటర్లు, డ్రోన్లు పంపిణీ చేశారు. వ్యవసాయంలో ఎలాంటి సందేహాలున్నా రైతు వేదికల వద్ద వ్యవసాయ అధికారులను సంప్రదించి సూచనలు, సలహాలు పొందాలని రైతులకు సూచించారు.కార్యక్రమంలో విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు, సొసైటీ చైర్మన్ టి. వీరభద్రం, అడప అనిల్, కాపా సుధాకర్, సర్పంచులు, సొసైటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై కఠిన చర్యలు

**15 రోజుల్లో నిషేధిత ప్లాస్టిక్ తొలగించాలి -లేదంటే జరిమానాలు తప్పవు**
**మున్సిపల్ చైర్పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ హెచ్చరిక**





**నర్సంపేట/, మే 7 (జర్నలిస్ట్):** పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టాలని మున్సిపల్ చైర్పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.నర్సంపేట మున్సిపాలిటీ కార్యాలయంలో ఏఎస్ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై ఫంక్షన్ హాల్స్, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల యజమానులతో అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి చైర్పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్, మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కప్పులు, గ్లాసులు, స్పూన్లు, ప్లేట్లు, స్ట్రాలు, 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న క్యారీ బ్యాగుల వినియోగాన్ని వెంటనే నిలిపివేయాలని సూచించారు. ప్లాస్టిక్ భూమిలో కరగడానికి వందల ఏళ్లు పడుతుందని, భూగర్భ జలాలను కలుషితం చేయడంతో పాటు పశువుల ప్రాణాలకు ముప్పుగా మారుతోందన్నారు.ప్లాస్టిక్ వస్తువుల్లో వేడి ఆహారం తీసుకోవడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల్లో 15 రోజుల్లోగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు. ఫంక్షన్ హాల్స్‌లో పేపర్ ప్లేట్లకు బదులుగా తాటి, అరటి ఆకులతో తయారైన ప్లేట్ల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లలో వేడి ఆహారం తీసుకోవడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్లాస్టిక్‌కు బదులుగా బయో కవర్లు వినియోగించాలని హోటల్ నిర్వాహకులను కోరారు.సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏఎస్ఆర్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్‌ను చైర్పర్సన్, కమిషనర్ అభినందించారు.కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రామకృష్ణ, కౌన్సిలర్ పొన్నాల మనిషా ప్రకాష్, హోటల్ యజమానులు, ఫంక్షన్ హాల్ నిర్వాహకులు, ప్లాస్టిక్ దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

